రచన మాసపత్రిక 'కథాపీఠం' పురస్కారం పొందిన కథ

# మా మల్లవరం మామయ్య



నర్సాపురంలో బస్సు దిగి మల్లవరం వెళ్ళే బస్సుకోసం ఎంక్వైరీ చేశాను.

బస్సులు తిరగటం లేదనీ, షేరింగ్ ఆటోలు నడుస్తున్నాయనీ చెప్పేరు. జనాన్నీ ఈగల్నీ తప్పించుకుంటూ రోడ్డు దాటి ఆటోల దగ్గరికెళ్ళేను.

"రండి రండి" ఆటో అతను ఆహ్వానించాడు.

ఆటోలోకి తొంగి చూశాను. ముగ్గురు కూర్చునున్నారు.

"నాకొక్కద్దానికే ఆటో కావాలి. జనరల్‌గా ఎందర్ని ఎక్కించుకుంటావో అందరి టిక్కెట్టూ నేనే పే చేస్తాను....."

ఆటో అతను లోపల కూర్చున్న వారి వంక ఇబ్బందిగా చూస్తూ "మంచి బేరవండి...." అన్నాడు.

వాళ్ళు నావంక కించిత్తు నిరసనగా చూసి దిగిపోయారు.

నేనెక్కి కూర్చున్నాను. ఆటో కదిలింది.

గతుకుల రోడ్డు. ఆటో ఎత్తి కుదేస్తోంది. "స్లోగా పోనియ్" విసుక్కున్నాను.

ఈ మనుషులూ, ఈ రోడ్లూ, ఈ అశుభ్రతా ఇక ఎన్నటికీ మారవు. ఇండియా డెవలప్ అయిపోయిందని అరవడమే గానీ ఇంకో వందేళ్ళు పోయినా అమెరికా స్థాయికి చేరుకోదు.

"ఎవరింటికెల్లాలండి....."

"నర్సిమ్మూర్తి మావయ్యగారింటికి" విసుగు కప్పిపుచ్చుకుంటూ చెప్పేను.

"ఓరి బాబోరి బాబోయ్. మరి సెప్పేరు కాదేవండి. ఆరిని సూట్టానికొస్తున్నారా. తవరికేటవుతారేటండి...."

"మేనకోడల్ని....."

"హైదరాబాదు నుంచి వస్తున్నారాండీ....."

"కాదు అమెరికా నుంచి...." నా స్వరంలో గర్వం తొణికిసలాడింది. సర్దుకుని దర్పంగా కూర్చున్నాను.

"పనిగట్టుకుని అంత దూరం నుంచి వస్తున్నారా....రావల్సిందేలెండి. ఆర లాటిలాటి మనిషి కాదు. శానా గొప్పోరు. నేను పనీ పాటా లేకుండా అల్లరి చిల్లరిగా తిరుగుతోంటే ఆటో తిప్పరా అంటూ ప్రోత్సాపన చేసింది ఆరేనండి. మరిగంటే ఆరేమో అంతా కావాలంటారు. తవరేటండీ ఒంటికాయ సొంటి కొమ్ములా ఒక్కరే వుండాలనుకుంటన్నారూ....!"

గతుక్కుమన్నాను. మరి మాటలు పెంచడం ఇష్టంలేకపోయింది. చెట్లనీ పొలాల్నీ చేపల చెరువుల్నీ చూస్తూ కూర్చున్నాను.

చిన్నప్పుడు ఎన్నిసార్లు ఈ ఊరొచ్చానో లెక్కలేదు. గ్రామదేవత చల్లాలమ్మ తీర్థం

వేసవి శలవుల్లో వచ్చేది. ఆ పది రోజులూ ఇంటిల్లిపాదీ ఇక్కడి కొచ్చేవాళ్ళం. రోజూ పండుగలా వుండేది. అమ్మా నాన్నా రెండ్రోజులుండి అమ్మవారికి మొక్కుతీర్చి వెళ్ళిపోయే వారు గానీ, బంధువుల పిల్లలమంతా తీర్థం అయ్యేవరకూ ఇక్కడే ఉండిపోయేవాళ్ళం.

ఆటలు, పాటలు, నాటకాలు, కాలువలో ఈతలు, బొమ్మల పెళ్ళిళ్ళు.....ఎన్నో! తిండికి సమయం ఉండేదే కాదసలు.

నర్సిమ్మూర్తి మావయ్య, అత్తయ్య ఆప్యాయతకి మారుపేరుగా వుండేవారు. ఎంత అభిమానంగా చూసేవారో! మిగతా చుట్టాల పిల్లల కన్నా నన్ను మరింత బాగా చూసేవారు. నేనెప్పుడూ క్లాసు ఫస్టు వస్తానని మావయ్య ఎంతో ముచ్చటపడేవారు.

"నీకసలు ఇందిరమ్మ పేరు పెట్టాల్సిందే" అనేవారు నా తెలివితేటలు చూసి మురిసిపోతూ.

అప్పట్లో బ్రాహ్మణ పండితులొచ్చి మావయ్య ఇంటి అరుగు మీద కూర్చుని భాగవత రామాయణ పద్యాలు చదివి వినిపించేవారు. మావయ్య అయిదో పదో ఇచ్చి వారిని తృప్తి పరచి పంపేవారు. అటువంటప్పుడు నన్ను పిలిచి నన్నా పద్యాల్ని చదవమనేవారు. నేను చక్కగా చదువుతోంటే మావయ్య ఎంత పొంగిపోయేవారో చెప్పలేను. అత్తయ్య సరేసరి. చేతిలోని పని వదలి మరీ వచ్చి గుమ్మం ప్రక్కన నిలబడి వినేది. తర్వాత పెరట్లోకి తీసుకెళ్ళి ఇంత ఉప్పు దిష్టి తీసిపారేసేది.

మావయ్య గ్రామ పెద్దగా వుండేవారు. అమ్మవారి తీర్థపు పనుల్లోనూ ఆయనే. ఊరి వ్యవహారాల్లోనూ ఆయనే. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఊరి తలలో నాలికలా మసలేవారు. ఊళ్ళోకి ఆఫీసర్లు ఎవరొచ్చినా సరే మావయ్య ఇంట్లోనే చెయ్యి కడుక్కునేవారు.

"ఊరి గోల తప్ప ఇంటి గొడవ నీకు పట్టదురా అబ్బాయ్" అని అమ్మమ్మ సన్నగా కోప్పడేదిగాని మావయ్య నవ్వేసేవాడు.

"దేవుడు నీకు సాయపడే చేతులిచ్చాడ్రా" అని చిత్రంగా ఆ వెంటనే పొగిడేసేది.

ఊరంతా మావయ్యకిస్తోన్న గౌరవ మర్యాదలు చూసి పెద్దయ్యాక నేనూ అలా గొప్పదాన్నవ్వాలనుకునేదాన్ని. మహారాణిలా ఫోజు కొట్టాలనుకునేదాన్ని.

మావయ్యలా గాకపోయినా మరో రకంగా ఉన్నతస్థాయికి చేరుకున్నాను. ఇంజినీర్నయ్యాను. అమెరికా సంబంధం వచ్చింది. బంధువులు రకరకాలుగా భయపెట్టినా నేనా సంబంధమే చేసుకుంటానని పంతం పట్టి మరీ నెగ్గించుకున్నాను.

భూతల స్వర్గానికెగిరిపోయాక నా జీవితం సమూలంగా మారిపోయింది.

హరీష్‌తో బాటు నేనూ ఉద్యోగంలో చేరాను. అమెరికా, యూరప్ అంతా చుట్టేశాం. ఎప్పుడైనా మావయ్యకి ఫోన్ చేసినప్పుడు ఆ విశేషాలు పూసగుచ్చినట్టు చెప్పేదాన్ని.

మేం కారు కొనుక్కున్నామనీ, గ్రీన్ కార్డు వచ్చిందనీ, ఇల్లు కొన్నామనీ, బాబు పుట్టాడనీ మావయ్యకి ప్రత్యేకంగా ఫోన్ చేసి మరీ చెప్పేను. అప్పుడెంత పొంగిపోయారో మాటల్లో వర్ణించలేను.

మావయ్య సంతానంకన్నా నేను ఉచ్ఛస్థితిలో వున్నందుకు ఎంతో గర్వపడి వుంటారని రాసివ్వగలను.

అమెరికా వెళ్ళిన నాలుగేళ్ళకు మా ఆడబడుచు పెళ్ళయితే ఇండియా వచ్చాం. 'చూడాలనుంది వచ్చి వెళ్ళ'మని మావయ్య కబురు పంపారు గాని వీలు పడలేదు. మావయ్య చాలా నిరాశపడ్డారని, ఆ తర్వాత అమ్మ ఫోన్లో చెప్పింది.

ఆ తర్వాత మూడేళ్ళకి ఇదిగో ఇప్పుడే ఇండియా రావటం. ఇప్పుడైనా రాకపోయేదాన్నే కాని అమ్మ గురించి రాక తప్పింది కాదు.

గత ఏడాది నుంచీ అమ్మ ఆరోగ్యం బాగోలేదు. సంగతి తెలిసిన వెంటనే రెండు లక్షలు పంపించాను. పెద్ద హాస్పటల్లో వైద్యం చేయించమన్నాను. అలాగే చేయించారు కాని అమ్మ కోలుకోలేదు. ఫోన్ చేసిన ప్రతీసారీ నన్ను చూడాలనుందని ఏడ్చేది. ఇంట్లో ఆఫీసులో నా నెత్తి మీద ఎన్ని బరువులూ బాధ్యతలూ వున్నాయో తనకేం తెలుసు. వస్తాననేదాన్ని గాని రావటం పడలేదు.

అమ్మ ఇరవై రోజుల క్రితం కాలం చేసింది. మరి తప్పక బాబుని హరీష్‌కప్పగించి ఒక్కద్దాన్నీ వచ్చాను. ఇంకో మూడ్రోజుల్లో వెళ్ళిపోవాలి. ఇక్కడ చాలా షాపింగ్ చేయాలి. ఆ తర్వాత బ్యాగేజ్ సర్దుకోవాలి. చాలా చాలా పనుంది. అయినా మావయ్యకి సీరియస్‌గా వుందని తెలిసి మొఖం చూపించి పోదామని వచ్చాను.

ఆటో మల్లవరం గ్రామంలో ప్రవేశించింది.

రూపురేఖలు మారిపోయిన మాలపల్లెని చూచి ఉలిక్కిపడ్డాను. నా చిన్నప్పుడు చూచిన గుడిసెలు, పందులు, మురుగు నీరు మచ్చుకి లేవు.

ఇళ్ళు బాగున్నాయి. డాబాలూ లేచాయి. సిమెంటు రోడ్లు పడ్డాయి. పరిసరాలు పరిశుభ్రంగా వున్నాయి.

"మాలపల్లి ఇలా మారిపోడానికి ముఖ్య కారకులు తవరి మావయ్యగారేనండి. ఆయ్. ఊళ్ళో ఎవరెన్ని జెండాలు మార్చినా ఆయన్ది మూడురంగుల జెండాయేనండి. దాన్నీ వదల్లేదు. ఖద్దర్నీ వదల్లేదంటే నమ్మండి. జనం బాగే ఆయన ఎజెండా అనుకోండి. మాలపల్లెలోని లీడర్లంతా ఆయన శిష్యులేనండి. ఊళ్ళో పేదోళ్ళకి ఇళ్ళొచ్చినా, వితంతువులకి పెన్షన్లొచ్చినా, ఏవొచ్చినా సగం కృషి ఆరిదేనండి. ఆరు మామూలోరు కాదు. తనింటి పని పక్కనెట్టి ఊరికోసం తిరుగుతారండి. ఇనడానికి సోద్యంగా వున్నా ఇది నిజవండి.

నా మీద ఒట్టండి.....” ఆటో కుర్రాడి రన్నింగ్ కామెంటరీ!

చెరువు వంక ఆసక్తిగా చూశాను. ఇది వరకు తామరాకులూ పూలూ నిండా వుండేవి. దోనె ఎక్కి నీటిని త్రోస్తూ వెళ్ళి తామరపూలు కోసుకొచ్చేవాళ్ళం. దోనె లేనప్పుడు మగపిల్లలు పోటీలు పడి మరీ చెరువులోకి దూకి కోసుకొచ్చి మాకిచ్చేవాళ్ళు. అటువంటప్పుడు యువరాణిలా ఫీలవడం నాకిప్పటికీ గుర్తుంది!

“ఇది వరకు ఈ చెరువులోంచే నీళ్ళు బిందెల్తో కావిళ్ళతో పట్టుకెళ్ళేవోరండి. ఇప్పుడు కుళాయిలొచ్చేసాయండి”

ఆ మధ్యెప్పుడో కుళాయి నీరు శుద్ధిచేసి మంచినీరు సప్లై చెయ్యడానికి బైర్రాజు ఫౌండేషన్ వారు ముందుకొచ్చారనీ సగం ఖర్చు జనం భరించాల్సి ఉందనీ నువ్వేమైనా సాయం చెయ్యగలవా అని మావయ్య అడిగారు. ఆయన్లా నేను గొప్పలకి పోననుకుంటూ “నాకు చాలా ఖర్చులున్నాయి మావయ్యా. ఎంత చెట్టుకి అంత గాలి అన్నది నీకు తెలిసిందేగా. సారీ” అన్నాను. చూస్తోంటే ఆ పని పూర్తి చేసినట్టే వున్నారు!

“ఇదంతా మా మావయ్య గొప్పేనంటావ్” అన్నాను ఇంకేమనాలో తోచక.

“ఏ పనికైనా ఊరందర్నీ కలిపేరంటే గొప్పే కదండీ. సిన్న పని చేసి పెద్ద కబుర్లు సెప్పేవోళ్ళనీ రూపాయి పని చేసి వంద నొక్కేవోళ్ళనీ చూసుంటారు. నర్సిమ్మూర్తిగారు ఆ బాపతు కాదండి. నిఖార్సైన మనిషి”

నాదృష్టి హైస్కూలు బోర్డు మీద పడింది “హైస్కూలొచ్చిందా?”

“అయ్. ఇదీ నర్సిమ్మూర్తి గారి సలవేనండి. దీని కోసం ఎన్నిసార్లు హైదరాబాదూ ఏలూరూ తిరిగేరో లెక్కలేదండి. ఏవైతేనేం. సాధించేరండి. ఇదివరకు పదిమందో పాతికమందో మచ్చిపురి హైస్కూలుకెళ్ళి చదువుకునేవారండి. ఇప్పుడిక్కడ వందమందిపైనే చదువుతున్నారండి. మనిషిని బాగుజేసేది చదువొక్కటేరా అంటా వుంటారండి. ఈ సైకిళ్ళ షెడ్డుని ఆరబ్బాయి కట్టించారండి.....”

రాజుల సొమ్ము రాళ్ళపాలు అని మావయ్య గొప్పలకోసం ఆస్తిని తగలేయడమే గాక కొడుకుల చేతా చేయిస్తున్నాడన్నమాట!

నిట్టూర్చాను.

“ఆ పైన కన్పిస్తోంది చూశారా, అది సొసైటీ బిల్డింగండి. ఆ స్థలం అప్పుడెప్పుడో ఆరు దానమిచ్చిందేనండి. ఆరూ సర్వారావుగారూ కలిసి వూళ్ళోకి సొసైటీ తెచ్చేరండి. రైతులకి ఇంత అప్పు పుట్టేలా సేశారండి....”

నడి స్తంభం దగ్గర మలుపు తిప్పి మావయ్య ఇంటి ముందు ఆటో ఆపాడు.

ఆటో దిగుతూ ఎత్తరుగుల ఇంటి వంక ఆరాధనగా చూశాను. ఇల్లు చాలా

పాతబడింది. అరుగులు బీటలు తీశాయి. కప్పు కొంచెంగా ఒరిగింది. చూరుకో ప్రక్కన పిచ్చుకలకోసం వరికంకుల కుప్ప వ్రేలాడుతోంది. ఇంటి అరుగు  జనంతో ఇదివరకట్లానే కిటకిటలాడ్తోంది.

హ్యాండ్‌బ్యాగ్ తెరచి వంద నోటు తీసిచ్చాను.

"ఉంచండి....."

"ఫరవాలేదు తీసుకో"

"మా నర్సిమ్మూర్తిగార్ని చూట్టానికొచ్చారు కదండీ. తీసుకోలేనండి. మళ్ళీ తిరిగెళ్ళేప్పుడు ఇదిగో ఈ నెంబరుకో రింగు కొట్టండి. కాకిలా వచ్చి వాలిపోతాను" చిన్న స్లిప్ మీద సెల్ నెంబర్ రాసిచ్చి వెళ్ళిపోయాడు ఆటో అతను.

'నిజంగా పిచ్చోడే' అనుకుంటూ లోపలికెళ్ళాను.

అరుగు మీది జనం గుసగసలు చూసి, "మావయ్య పోయారా?" అదుర్దాగా అడిగాను ఒకతన్ని.

ఆయన పోతే శవాన్ని చూసి నేను చేసేదేముంటుంది నా ముఖం!

వాళ్ళు నా వంక అదోలా చూసి తల అడ్డంగా వూపారు.

చిన్నగా నిట్టూర్చాను. వచ్చిన పని దండుగవ్వలేదు!

పెదబావా, చినబావా "రా రాణీ రా....." అంటూ ఎదురొచ్చి ఆహ్వానించారు.

అత్తయ్య నన్ను కావలించుకుని బావురుమంది. "మీ మావయ్య మంచం పట్టేరు తల్లీ.....!"

"సడన్‌గా ఇలా ఎలా అయ్యింది పెదబావా"

"లివర్ క్యాన్సర్" లోగొంతుకతో చెప్పేడు.

"మైగాడ్! మరి ట్రీట్‌మెంటిప్పించలేదా?"

"సంగతి తెలిసే సరికే ముదిరిపోయిందన్నారు. గోదావరి పుష్కరాల్లో వద్దన్నా వినకుండా రోజూ తలస్నానం చేశాడు. రొంప, దగ్గు.....కళ్ళు పచ్చబడ్డాయి. కామెర్లనుకుని వెల్ల మందు వాడాం. ఇక్కడి డాక్టరుకీ చూపించాం. ప్చ్. ఏదీ పని చేయలేదు. నర్సాపురం తీసుకెళ్ళి టెస్టులు చేయిస్తే అప్పుడు బయటపడింది. ఇక రోజులు కాదు గంటలే మిగిలాయి....!"

అప్రయత్నంగా దు:ఖం తన్నుకొచ్చింది.

"ఊరుకో అమ్మాయ్. వయస్సు పైబడిందాయె. పోవడానికేదో కారణం ఉండాలిగా. అయినా మన చేతుల్లో ఏవుంది గనుకా!" అందొకావిడ.

"ఊపిరున్నంత కాలం నా ఇల్లు, నా వాళ్ళు అని పాకులాడతాం. చిలక ఎగిరిపోయాక ఎవరికెవరో!" వేదాంతం వల్లించింది మరొకావిడ.

"నాన్నని చూద్దువుగాని రా" అన్నాడు చినబావ.

హాల్లోనూ, అరుగు మీదా ఇందాకటి కన్నా జనం పోటెత్తినట్టు పెరిగారు.

"వీళ్ళంతా.....!"

"నాన్నని చూడటానికొచ్చారు.."

చటుక్కున హరీష్‌కి జరిగిన యాక్సిడెంట్ ఘటన గుర్తొచ్చింది.

హరీష్ కార్లో ఆఫీసుకెళ్తోంటే యాక్సిడెంటయ్యింది. పోలీసులు ఆసుపత్రిలో చేర్చి ఫోన్ చేశారు. ఇంటి నుంచి 150 మైళ్ళ దూరంలో జరిగిందది. ఆ ప్రాంతంలో ఉన్న మిత్రులకీ, పరిచయస్తులకీ ఫోన్ చేసి హెల్ప్ చేయమని అర్థించాను. పడుతూ లేస్తూ నేనే వెళ్ళి అన్నీ చూసుకోవాల్సి వచ్చింది తప్ప వీకెండ్ దాకా ఒక్కరంటే ఒక్కరు తొంగి చూడలేదు. ఆయన అతీ గతీ పట్టించుకోలేదు!

"మావయ్యంటే ఊరందరికీ చాలా అభిమానం అనుకుంటానే" అన్నాను.

"అవునమ్మా. దారిపొడవునా విత్తనాలు చల్లుకుంటూ వెళ్తారు మీ మావయ్య. అవి మొలకెత్తి మొగ్గదొడిగి పుష్పించి పూలబాటగా మారుస్తుంటాయి" అన్నాడొకాయన.

నాకేమీ అర్థంకాలేదు. చిన్నగా నవ్వి గదిలోకెళ్ళాను.

లోపల పదిమంది దాకా ఊరోళ్ళు వున్నారు.

మంచానికంటుకుపోయి ఉన్నారు మావయ్య. కాళ్ళూ చేతులూ ఈనుపుల్లలా వున్నాయి. పొట్ట మాత్రం బాగా పెద్దగా ఉబ్బి ఉంది. మొఖం పీక్కుపోయినా ఏదో కాంతి వెళ్ళాడుతూనే వుంది.

"రామ్మా రా. ఇలా కూర్చో. ఎలా ఉంది మీ అమెరికా?"

"చాలా బావుంది. మీకెలా వుంది మావయ్యా"

"నాకేమమ్మా మహారాజులా వున్నాను. జరుగుబాటుంటే జ్వరమంత సౌఖ్యం లేదన్నారు తెలుసా?" అని నవ్వి అన్నారు "అమెరికా అంతా తిరిగి చూశావా"

"అమెరికా, యూరప్ అన్నీ చుట్టేశాం" గొప్పగా చెప్పేను.

"సంతోషం. అక్కడేం గొప్పలున్నాయో నాకు తెలీదుగాని మన దేశంలోని శాంతినికేతన్ చూశావా? రామప్ప దేవాలయం? త్రివేణీ సంగమంలో స్నానం చెయ్యలేదు కదూ? అన్నట్టు కన్యాకుమారి వెళ్ళలేదు, అవునా? ఇహ అటు హంపి, ఇటు కోణార్క్ గుర్తుండే ఉండవు. పొట్ట కోసం ప్రపంచం చుట్టి రావచ్చుగానీ మన వేళ్ళనీ మన సంస్కృతినీ మరచి పోకూడదు తల్లీ. మనం ప్రతివారికీ హితులుగా సన్నిహితులుగా స్నేహితులుగా ఉండాలి. నన్ను ముట్టుకోకు నామాల కాకి అన్నట్టు ఉండకూడదు. నా చిన్ని పొట్టకు శ్రీరామరక్ష అనుకోకూడదు....."

ఇదంతా నాకే ఎందుకు చెబుతున్నారో అర్థంగాక అయోమయంగా చూశాను.

అందరి ముందూ అలా చిన్న పిల్లకి చెప్పినట్టు చెబుతోంటే ఎంతో న్యూనతగా అవమానంగా అన్పించింది.

ముక్కుపుటాలెగరేస్తూ నిర్లక్ష్యంగా చూశాను. అప్పుడు స్ఫురించింది. మావయ్య సంతానమెవరూ అమెరికా ముఖం చూడలేదు. ఆ అదృష్టం కేవలం నాకు మాత్రమే దక్కిందని ఈర్ష్యతో కుళ్ళిపోతూ అలా మాట్లాడి వుంటారు!

"ఎక్కువగా మాట్లాడొద్దన్నారు డాక్టరు. విశ్రాంతి తీసుకో నాన్నా" చిన బావ కల్పించుకుంటూ అన్నాడు.

"మేమొచ్చి వాగిస్తున్నాం. వెళ్ళొస్తాం" అన్నారొకరు.

"ఏం ఫర్లేదుగాని వుండండ్రా. మీ అమ్మాయిని చదువుమాన్పించి పెళ్లిచేశావంటే ఊరుకోనొరేయ్. చదివించరా. తన కాళ్ళ మీద తనని నిలబడనీ. ఆ తర్వాత పెళ్లిచెయ్. అదీ సంతోషపడుతుంది... కడుపున పుట్టినవాళ్ళు చక్కగానూ పెరుగుతారు"

"తవరి మాట కాదనగలనేంటి. అలాగే చేస్తాన్లెండి"

ఒకావిడ ముందుకొచ్చి "మా పిల్లలు వాటాలు తెగక కాలు దువ్వుకుంటున్నారు. మీరో మాట చెబితే......"అంది కళ్ళొత్తుకుంటూ.

"మాదోచ్చోద్ వెధవలు. వాళ్ళని నా ముందుకి తీసుకురా ఇంత గడ్డిపెడతాను. ఒళ్ళు ఎదిగితే చాలదు బుద్ధి ఎదగాలి...." అంటూ ఆవేశపడి ఆయాస పడసాగాడు మావయ్య.

"నెమ్మది నెమ్మది....." గుండెలు నిమిరారొకరు.

ఏదో గుర్తొచ్చింది కాబోలు, "నాకేం కాదుగాని మా పెద్దోడేడి?" అని అడిగారు.

పెద బావ ముందుకొచ్చాడు.

"పశువుల శాలలోని మూల చెట్టుని కొట్టమన్నాను. ఇంకా కొట్టలేదంటేంట్రా. వెంటనే కొట్టించి కట్టెల్ని ఎండలో ఆరబెట్టించు. అవసరమొచ్చేక అటూ ఇటూ పరుగెడితే కాదు ముందు చూపుండాలి. వెళ్ళెళ్ళు"

"మీకేం కాదు నర్సిమ్మూర్తిగారూ" ఒక గ్రామస్తుడన్నాడు.

"ఇప్పుడు కట్టెల అవసరమేముంది మావయ్యా" అమాయకంగా అడిగాను.

"ఈ కట్టె కాలడానికి కావల్సింది కట్టెలే కదా. రాజు అయినా పేద అయినా వెళ్ళాల్సింది ఒక్క చోటుకేనే, వట్టి చేతుల్తోనే!"

నా మొఖం ఎర్రబడింది. ఎందుకొచ్చానా అని తిట్టుకుంటూ ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చున్నాను.

"మీరు విశ్రాంతి తీసుకోండి నర్సిమ్మూర్తిగారూ" ఒకాయనన్నాడు.

"నాకు తెలుసులేరా....ఒరేయ్ సుబ్బన్నా.....పెదరామన్నకి ఈనెల పెన్షన్ రాలేదంట. నర్సాపురం వెళ్ళినప్పుడు కాస్త కనుక్కో...."

తలూపేడతడు.

మావయ్య ధోరణి చాలా చిత్రంగా అన్పించింది. చనిపోయే ముందు ప్రశాంతంగా ఉండకుండా, ఏ భగవద్గీతో వినకుండా ఊరోళ్ళగొడవెందుకో! ఎంత కీర్తికండూతి వుంటే మాత్రం మరీ ఇంత ఇదా!

ఉండబట్టలేక నా మనస్సులోని మాటల్ని కక్కేశాను. రిటార్డివ్వడానికి ఇంతకంటే మంచి అవకాశం నాకు మరి రాదు.

"ఇన్నేళ్ళూ ఊరికోసం జనం కోసం తాపత్రయపడ్డారు. శక్తికి మించి చేశారు. ఆస్తిని సైతం హారతి కర్పూరం చేసేశారు. ఇంక చాలు మావయ్యా. ఇంక ఇవన్నీ వదిలేసెయ్. హాయిగా కృష్ణా రామా అనుకో"

ముసిముసిగా నవ్వేడు మావయ్య.

"నా ముద్దుల మేనకోడలు ఏమందో విన్నారుట్రా . అమెరికా అమ్మాయి. అమెరికా ఆలోచనలు!" అని చెప్పి, నా వంక ఆప్యాయంగా చూస్తూ అన్నారు–

"నేనింకా బ్రతికే వున్నాను తల్లీ!"

*      *      *

(రచన– ఏప్రిల్ 2016)